క్లుప్తంగా

వృథాగా పోతున్న సాగునీరు



తోట్లవల్లూరు: పెనమకూరు వద్ద బందరుకాలువ పొంగిపొర్లుతోంది. కాలువ గట్టు పటిష్టంగా లేకపోవడంతో ఎంతో విలువైన సాగు, తాగునీరు వృథాగా ఏనుగులకోడు డ్రెయిన్‌లో కలిసిపోతోంది. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేసినా స్పందించిన నాథుడు లేడు. కాలువ ఇలాగే పొంగితే కాలువ కట్ట కోతకు గురికావడంతోపాటు ఏనుగుల కోడు డ్రెయిన్ కట్టపై నివాసం ఉంటున్న ఎస్సీ, బీసీ కుటుంబాల పరిస్థితి ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువలో నీటి విడుదలను తగ్గించి సాగునీటి వృథాను అరికట్టాలని స్థానికుడు బత్తిన సోమేశ్వరరావు, గ్రామస్తులు కోరుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం



గుడివాడరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొరిసెట్టి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. దేశానికి రైతు వెన్నెముక, రైతు వెన్ను విరిచేలా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 10 శాతం కూడా వ్యవసాయానికి నిధులు కేటాయించలేదని విమర్శించారు. రైతులకు ప్రాధాన్యం ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం కళ్లు తెరచి రైతులకు నిధులు కేటాయించేలా చూడాలని సీపీఎం తరఫున కోరుతున్నామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకుడు నీలం మురళీకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

పామర్రు: లయన్స్ క్లబ్ ఆఫ్ పామర్రు వారి సౌజన్యంతో చిరు వ్యాపారులకు శుక్రవారం గొడుగులను పంపిణీ చేశారు. రోడ్ల వెంబడి చిరు వ్యాపారాలు చేసుకునే వారికి వీటిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నవులూరి వీర వెంకయ్య, కార్యదర్శి మధుసూదనరావు, కోశాధికారి గడ్డాడ విక్టర్ పాల్, సభ్యులు బైసాని నాగేశ్వరరావు, తోట రమేష్, లంకపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత



గుడివాడరూరల్: శ్రీకృష్ణ యాదవసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో పల్లపోతు వెంకటనాగబాబు కుమార్తె జ్యోష్నశ్రీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని శుక్రవారం అందజేశారు. స్థానిక ఎస్పీఎస్ హైస్కూల్, కళాశాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలు, స్టేషనరీని సేవా సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి, ఏఓ అనంతలక్ష్మి, ప్రముఖులు గఫార్, తిరుపతయ్య, తోటరాజు, అర్జున్, తాతారావు, నాగమణి, పాఠశాల హెచ్ఎం రాణి పాల్గొన్నారు.

వసతిగృహంలో మౌలిక వసతుల పరిశీలన



కైకలూరు: వసతి గృహంలో మౌలిక వసతులపై ఎంఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని కోరుకొల్లు సోషల్ వెల్ఫేర్ బాలికల బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. వెల్ఫేర్ ఆఫీసర్ నాగమణి, వాచ్‌మెన్ కృష్ణవేణి నుంచి వివరాలు సేకరించారు. రిజిష్టర్‌లో బాలికలు 27 మందికి 24 మంది ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా హాస్టల్ నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు హంసలదీవిలో చెరువుల లీజు వేలం

కోడూరు: మండలంలోని హంసలదీవి పంచాయతీ పరిధిలోని చెరువులకు సంబంధించి శనివారం లీజు వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. హంసలదీవి, పాలకాయతిప్ప గ్రామాల్లో ఉన్న నాలుగు చెరువులకు వేలంపాటలు ఉంటాయన్నారు. ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే పాటలో ఆసక్తిగల రైతులు తగిన ధరావతు చెల్లించి పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఆషాఢ మాసోత్సవాలు



గుడివాడలో అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పిస్తున్న భక్తులు



పామర్రులో శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన వల్మీకేశ్వరీ దేవి

గుడివాడరూరల్: గుడివాడ పట్టణంలోని అన్ని ఆలయాల్లో ఆషాఢ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆషాఢ మాస మూడో శుక్రవారం సందర్భంగా అమ్మవారు శ్రీశాకంబరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఆలయాలకు వచ్చి అమ్మవార్లకు ఆషాఢ సారెను సమర్పించారు. పట్టణంలోని భీమేశ్వరాలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో శ్రీశాకంబరీదేవి అలంకారణలో పార్వతీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు మామిళ్ల సోమేశ్వరశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీలలితా భక్తబృందం సభ్యులు అమ్మవారికి సారెను సమర్పించినట్లు దేవస్థానం ఈఓ షణ్ముఖ నటరాజన్ తెలిపారు. అదేవిధంగా కొత్తపేట ఏడో వార్డులో శ్రీవిజయదుర్గ అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు.

కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..

గుడివాడ పట్టణంలోని వాసవీచౌక్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శాకంబరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారికి శ్రీవిజయదుర్గ భజన కోలాట సమాజం వారు సారెను సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, ఆర్యవైశ్య కల్యాణమందిర అధ్యక్షుడు పోకూరి మోహనరావు, ప్రముఖులు దండమూడి సీతారామస్వామి పాల్గొన్నారు.



గుడివాడ భీమేశ్వరాలయంలో శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన పార్వతీదేవి

సీతమ్మ తల్లికి ఆషాఢ సారె

జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలో వేంచేసియున్న సీతారామచంద్రస్వామి ఆలయంలోని సీతమ్మ తల్లికి భక్తులు శుక్రవారం ఆషాఢ సారెను సమర్పించారు. ఆలయంలో పూజాధికాలను ఆలయ అర్చకులు రొంపిచర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ సర్పంచ్ కె.చంద్రశేఖరరావు, ధనలక్ష్మి దంపతులు, కాకర్ల కృష్ణదాసు, పుష్పావతి దంపతులు, కాకర్ల సాయిబాబు శివనాగమణి దంపతులు, కూనపరెడ్డి చెన్నారాయుడు దంపతులు పూజాధికాలను చేశారు.

అంకమ్మతల్లి ఆలయంలో..

స్థానిక అంకమ్మతల్లి, గంగానమ్మతల్లి ఆలయాల్లోని అమ్మవార్లకు భక్తులు ఆషాఢ సారెను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, పాండురంగారావు, పేరయ్య, వెంకటమురళీకృష్ణ, కె.దుర్గాప్రసాద్, ఉమా పాల్గొన్నారు.



గుడివాడ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శాకంబరీదేవిగా అమ్మవారు

శాకంబరీ దేవిగా వల్మీకేశ్వరీదేవి

పామర్రు: స్థానిక వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయం (పుట్టమ్మతల్లి) ఆలయంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి సుశీల దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. సాయింత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులు లలిత సహస్రనామ పారాయణ చేశారు. అంకమ్మ తల్లి ఆలయంలో పాతాళేశ్వరీ అమ్మవారి ఆలయాలలోని అమ్మవార్లకు శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

సాహు మహరాజ్ సేవలు వెలకట్టలేనివి



మండవల్లి: దేశంలో మొట్టమొదటి రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ చేసిన సేవలు వెలకట్టలేనివని మండవల్లి బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మహరాజ్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చాబత్తిన విజయ్, కె.శాంతరాజు, గోరింక గాంధీ, కె.రవిప్రసాద్, దాకరపు వినోద్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



మండవల్లి: మండవల్లిలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏలూరు శంకర నేత్రాలయానికి చెందిన వైద్యులు శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 145 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 43 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ణయించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని నేత్రాలయం సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ చిట్టిబాబు, విజయకుమార్, సత్తిబాబు, భాస్కరరావు, కృష్ణ, రంగరాజు, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

వరినాట్లు ఆలస్యమైతే.. ఇలా వేయాలి



వ్యవసాయాధికారి అనంతలక్ష్మి

గుడ్లవల్లేరు: సకాలంలో వరి నాట్లు వేయలేక ఆలస్యమైతే.. రైతులు ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులు ఇలా ఉన్నాయి. వీటిపై గుడివాడ వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి ఇస్తున్న సలహాలు ఇవే..

ముదురు నారు నాటాలి

దీర్ఘకాలిక రకాల్లో నారు వయసు 60 రోజుల ఉంటే నాటవచ్చు. మధ్య కాలిక రకాలకు సంబంధించి 50 రోజుల వయసు ఉండే నారును కూడా నాటుకోవచ్చు.

- నీటి లభ్యత లేని ప్రాంతాల్లో నాట్లు ఆలస్యమయ్యేటపుడు నారుమడికి ఎరువులు వేయటం ఆపాలి. అవకాశాన్ని బట్టి బెట్టను తట్టుకోవడానికి ఒక శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణం పిచికారీ చేయాలి.

ఇలా నాటాలి..

ముదురునారు నాటితే పిలకలు తక్కువవుతాయి. నాట్లు దగ్గర దగ్గరగా వేసుకోవాలి. చదరపు మీటరుకు 33 మూనలకు బదులుగా 44 కుదుళ్లు నాటాలి. ఒక్కో కుదురుకు 2–3మొక్కలకు బదులుగా 4–5మొక్కలు ఉండేటట్లు చూసుకోవాలి.



వరినాట్లు వేస్తున్న కూలీలు

పురుగులు, తెగుళ్ల నివారణ ఇలా..

పురుగులు, తెగుళ్ల ఉనికిని గమనించుకుంటూ నారుమడిలో అవసరం మేరకు సస్యరక్షణ చేపట్టాలి. నారుమడిలో విత్తిన 3–5రోజుల్లో ఎకరం నారుమడికి 35 గ్రాముల ఆక్సాడయార్జిల్‌ను లేదా 80 గ్రాముల పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్‌లో ఏదో ఒక దానిని అరలీటరు నీటిలో కలపాలి. ఆ ద్రావణాన్ని 20 కిలోల పొడి ఇసుకతో మిశ్రమం చేయాలి. పలుచటి నీటి మీద పొలంలో చల్లుకోవాలి.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కైకలూరు: ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవనం ఉంటుందని వైద్యులు సూచించారు. మండలంలోని తామరకొల్లు, వేమవరప్పాడు పాఠశాలల్లో విద్యార్థులకు స్టాప్ డయేరియా కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కలిగించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ఇంట్లోని వారికి అవగాహన కల్పించాలన్నారు. మురిగునీటి కుంటలు లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కుప్పలుగా చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయవద్దన్నారు. వైద్యశాఖ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నీటిని వేడిచేసుకుని చల్లారిన తర్వాత తాగాలన్నారు. అనంతరం వేమవరప్పాడు గ్రామంలో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్న రాంబాబు, ఉపసర్పంచ్ రాజు, హెచ్ఎం చంద్రశేఖర్, వైద్య సిబ్బంది జి.శ్రీనివాసరావు, తాతారావు, స్వాతి, సమర్పణ పాల్గొన్నారు.



వేమవరప్పాడులో దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

పరీక్షలు తెలుగు మాధ్యమంలోనూ నిర్వహించాలి

కైకలూరు: పబ్లిక్ పరీక్షలు తప్పనిసరిగా తెలుగు మాధ్యమంలో కూడా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం(ఏపీహెచ్ఎంఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి 2025 మార్చిలో నిర్వహించబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు తప్పనిసరిగా తెలుగు మాధ్యమంలోనూ అవకాశం కల్పించాలన్నారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమం కూడా కొనసాగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రాన్ని పంపామని పేర్కొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

రామవరప్పాడు: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ జాన్సన్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు సీబీసీఎన్‌సీ చర్చి వద్ద లేబర్ డేను పురస్కరించుకుని శుక్రవారం కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టే విధంగా తీసుకునే చర్యలను వివరించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ శారదా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జాన్సన్

ఇంటి పన్నుల సర్వే పరిశీలన

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో ఇంటి పన్నులు ఉన్నవారు వెంటనే చెల్లించాలని మున్సిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు సూచించారు. తాడిగడప, కానూరు ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటి పన్నుల సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లలో లక్ష్యం చేరాలని, ఇంటి పన్నులు లేని వాటికి పన్ను విధించాలని అన్నారు. ఇంటి పన్నుల్లో హెచ్చుతగ్గులు ఉన్నా సరి చేస్తామన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతుందా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు: మండలంలో మూడు గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. శనివారం ఉదయం ఏడు గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటినెన్స్‌కు సంబంధించిన ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హైస్కూల్లో కార్గిల్ విజయ్ దివస్



కైకలూరు: కార్గిల్ విజయ్ దివస్‌ను మండలంలోని ఆరుతెగళపాడు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో వీరోచిత పోరాటం చేసిన కైకలూరు మండలం భుజబలపట్నంకు చెందిన జంగం డేవిడ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా డేవిడ్ యుద్ధ విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జక్కుల విజయ్‌కుమార్, కై కలూరు జాగృతి హైస్కూల్ కరస్పాండెంటు పి.జయకిషోర్, ఏడీబీ బ్యాంకు మేనేజర్ అరుణ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ నరేష్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి



మండవల్లి: బ్యాంకు అధికారులు కౌలు రైతులకు సత్వరమే పంట రుణాలు అందించాలని మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా కోరారు. మండలంలోని లింగాల, మండవల్లి సప్తగిరి గ్రామీణా బ్యాంకులు, మండవల్లి కేడీసీసీ, ఇండియన్ బ్యాంక్ మేనేజర్లను శుక్రవారం కలిసి మండలంలోని కౌలు రైతుల జాబితాలను అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్లతో ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు పంట రుణాలు అత్యవసరంగా భావించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత లింగాలలో ఉడతా మద్దిరామయ్య అనే రైతు పొలంలో సాగు చేసిన పచ్చిరొట్ట పైరును పరిశీలించారు. నాట్లు వేసేముందు దుక్కిలో కలిపి దున్నితే భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి

కైకలూరు: విద్యార్థి దశ నుంచే బాలబాలికలు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి లక్ష్మి మాట్లాడుతూ ఇటీవల కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. ఆయా చట్టాలపై అవగాహనతో ఉండాలని సూచించారు. సీడీపీఓ దీప్తి మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లావణ్య, కృష్ణకుమారి, ప్యానెల్ న్యాయవాదులు పవన్, శివప్రసాద్, అధ్యాపకులు శ్రీనివాసరావు, జ్ఞానప్రసూనాంబ, హెచ్ఎం ముబీన్ భాను, ఏఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చట్టాలపై విద్యార్థులకు వివరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి

చేనేత పితామహుడు ప్రగడ

ఘంటసాల: కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన చేనేత పితామహుడు ప్రగడ కోటయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని చేనేత సీనియర్ కార్మికనేత మునగాల సుబ్బారావు అన్నారు. ఘంటసాల నందం బజార్‌లోని భావనా ఋషి కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ప్రగడ కోటయ్య 109వ జయంతి వేడుకలు మునగాల సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ కోటయ్య విగ్రహానికి వార్డు సభ్యురాలు నందం సుజాత, చేనేత మహిళలతో పాటు సుబ్బారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మునగాల సుబ్బారావును వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షులు దిరిశం పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో చేనేత కార్మికులు, మహిళలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నందం వెంకట నరసింహం, నందం భార్గవరావు, దిరిశం శ్రీను, మాచర్ల మస్తాన్, గుత్తికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఘంటసాల పంచాయతీ ప్రాంగణంలో జరిగిన ప్రగడ కోటయ్య జయంతి వేడుకలను కోస్తాంధ్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అందె జగదీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



ఘంటసాలలో చేనేత సీనియర్ కార్మికనేత మునగాల సుబ్బారావును సత్కరిస్తున్న దృశ్యం

సేంద్రియ వ్యవసాయంతో మేలైన దిగుబడులు


గూడూరు: రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి మేలైన దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ వనరుల విభాగం సహాయ సంచాలకుడు శ్రీనివాస్ అన్నారు. గూడూరు మండలం కంకటావలోని తోట విష్ణుమూర్తి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ విధానంలో వరిసాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. దీంతో నాణ్యమైన పంటలను పండించి మార్కెట్‌లో రైతుకు మంచి రేటు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. 14 వారాలపాటు నిర్వహించే జీఏపీ పొలంబడి కార్యక్రమాన్ని కంకటావను ఎంపిక చేసినట్లు గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు తోట పోతురాజు, తాతా వెంకట బసవమ్మ, వాకా శ్రీనివాస్, వెంకట్, వీఏఏలు పాల్గొన్నారు.



కంకటావలో జరిగిన పొలంబడిలో సూచనలు ఇస్తున్న శ్రీనివాస్

మడ అడవులతో ఉపయోగాలెన్నో

మచిలీపట్నం టౌన్: మడ అడవులతో ఎన్నో ఉపయోగాలున్నాయని మచిలీపట్నం అటవీ క్షేత్రాధికారి సుజాత అన్నారు. అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగర శివారులోని గిలకలదిండిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మడ అడవుల ప్రాముఖ్యతను, ఉపయోగాలను వివరిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మడ అడవుల ఉపయోగంపై హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జిల్లా అటవీ శాఖాధికారి కె.రాజశేఖరరావు ఆదేశాలతో కార్యక్రమాన్ని నిర్వహించామని సుజాత తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖాధికారులు షరీఫ్, వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వ్యాసరచనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం